


పన్నులు వసూలయ్యేదెలా?

కేఎంసీ పరిధిలో ఇంకా రూ.8.10 కోట్ల మేర పన్నులు వసూలు చేయాల్సి ఉండడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. 8లో



ఇఫ్తార్ (బుధవారం సా॥) 6.25

సహర్ (గురువారం ఉ॥) 4.57

రంజాన్ వేళలు

గరిష్టం / కనిష్టం $38^{\circ} / 22^{\circ}$

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు గరిష్టంగా నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

పన్నుల వసూళ్లలో జాప్యం వద్దు

వైరా: ఈనెలాఖరు నాటికి వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాల్సిందేనని మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ రీజినల్ డైరెక్టర్ షాహీద్ మసూద్ స్పష్టం చేశారు. వైరా మున్సిపాలిటీలో పన్ను వసూళ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పన్నులు వసూలు చేయాలని సూచించారు. మార్చి 31వరకు సెలవులు కూడా ఉండవని తెలిపారు. నిర్దేశిత లక్ష్యం కంటే తక్కువ వసూలైతే బాధ్యులపై చర్యలు తప్పవని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, ఆర్ఐ ప్రదీప్, ఉద్యోగులు పాల్గొన్నారు.

984మంది విద్యార్థులకు కంటి అద్దాలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో ఉంటున్న 984 మంది విద్యార్థులకు మొదటి విడతగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ బి.కళావతిబాయి తెలిపారు. ఇటీవల 3,557 విద్యార్థులకు కంటి పరీక్షలు చేయించగా 3,079 మందికి అద్దాలు అవసరమని తేల్చినట్లు పేర్కొన్నారు. ఇందులో మొదటి విడతగా 984 మందికి కంటి అద్దాలను పాఠశాలలు, హాస్టళ్లకు పంపినట్లు ఆమె తెలిపారు.

విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ లైన్లు



సబ్‌స్టేషన్‌లో పరిశీలిస్తున్న ఎస్ఈ, ఉద్యోగులు

ఖమ్మంఅర్బన్: రానున్న వేసవిలో డిమాండ్ పెరగనున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎదురుకాకుండా సబ్ స్టేషన్లకు ప్రత్యామ్నాయ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ ఐ.శ్రీనివాసాచారి తెలిపారు. ఖమ్మం ఖానాపురం పారిశ్రామిక ప్రాంతానికి మెరుగైన సరఫరా కోసం రూ.25లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన 33 కేవీ లైన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ లైన్‌తో బల్లేపల్లి సెక్షన్ పరిధి ఖానాపురం, బల్లేపల్లి, పాండురంగాపురం, బాలపేట, జయనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో మెరుగైన సరఫరా చేయొచ్చని తెలిపారు. డీఈ ఎస్.రామారావుతో పాటు ఉద్యోగులు ఎం.సంజీవ కుమార్, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఓటర్ జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. జిల్లాలో ఓటర్ జాబితా సవరణ పకడ్బందీగా జరిగేలా ఉద్యోగులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ విషయంలో పార్టీల నాయకులు సహకరించాలని చెప్పారు. ఫారం–6 ద్వారా 4,734 దరఖాస్తులు రాగా 3,267 మందికి కొత్తగా ఓటు హక్కు కల్పించామని తెలిపారు. అలాగే, ఫారం–7 ద్వారా అందిన 3,352 దరఖాస్తుల్లో 2,450 పరిష్కరించగా, ఫారం–8 దరఖాస్తులు 11,820లో 9,573 పరిష్కారమయ్యాయని చెప్పారు. కాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు ఇప్పటికీ వ్యయ వివరాలు అందజేయలేదని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈసమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీహెచ్.స్వామి, డీటీ అన్సారీతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరి డీబార్

ఖమ్మం సహకారనగర్: ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. బోర్డు అబ్జర్వర్లు టి.యాదగిరి, ఆర్.వెంకటేశ్వర్లు మంగళవారం పలు కేంద్రాల్లో తనిఖీ చేయగా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఇద్దరు పట్టుబడ్డారని పేర్కొన్నారు. కాగా, మంగళవారం పరీక్షలకు 17,442మందిలో 17,001మంది విద్యార్థులు హాజరయ్యారని డీఐఈఓ తెలిపారు.

బడులకు నిధుల వరద!



తల్లాడ పాఠశాలలో క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈఓ, తదితరులు

స్కూళ్ల నిర్వహణ గ్రాంట్ రూ.3.90 కోట్లు

- క్రీడల కోసం మరో రూ.1.11 కోట్లు విడుదల
- 'అమ్మ' పాఠశాలలకు రూ.22 కోట్లు, పీఎంశ్రీలో ఇంకో రూ.3.35 కోట్లు
- గత ఏడాది నిధుల దుర్వినియోగం నేపథ్యాన ఈసారి ప్రత్యేక దృష్టి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు రెండో విడత నిధులు విడుదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్కూల్ గ్రాంట్లు, స్పోర్ట్స్ గ్రాంట్, అమ్మ ఆదర్శ పాఠశాలలకు కలిపి రూ.27,01,40,000 విడుదల చేయగా.. కేంద్రప్రభుత్వం నుంచి పీఎంశ్రీ ద్వారా రూ.3.35 కోట్లు మంజూరయ్యాయి. వీటిని పాఠశాలల్లో అభివృద్ధి పనులు, వసతుల కల్పన, క్రీడా పరికరాల కొనుగోలుకు వెచ్చిస్తారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలో మొదటి విడత నిధులు విడుదల చేయగా.. రెండో విడత మాత్రం విద్యా సంవత్సరం చివరలో విడుదలవడం గమనార్హం. అయితే ఈ నిధులను డ్రా చేసుకుని వచ్చే విద్యాసంవత్సరం ఆరంభంలోనూ వినియోగించుకునే వెసులుబాటు కల్పించడం ఊరటనిచ్చే అంశంగా చెబుతున్నారు. ఈ కార్యక్రమాల అమలును అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పర్యవేక్షిస్తూ పరిశీలనకు ఎంఈఓ, పీడీలతో బృందాలు ఏర్పాటు చేశారు.

స్కూల్ గ్రాంట్ రూ.3.90 కోట్లు

జిల్లాలోని 1,174 పాఠశాలలకు స్కూల్ గ్రాంట్‌గా రూ.3.90 కోట్లు విడుదలయ్యాయి. వీటిని విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల ఖాతాల్లో జమ చేశారు. 30 మంది విద్యార్థులు ఉంటే రూ.10 వేలు, 31–100 వరకు రూ.25 వేలు, 101–250 వరకైతే రూ.50 వేలు, 251–1000 మంది విద్యార్థులు ఉంటే రూ.75 వేలు చొప్పున జమ అయ్యాయి. ఈ నిధుల ను విద్యా ప్రణాళిక కోసం వినియోగించనుండగా, బడిబాట కార్యక్రమ నిర్వహణకు రూ.వేయి చొప్పున ఖర్చు చేయొచ్చు. ఇంటర్‌నెట్, పేపర్, జిరాక్స్‌లు, చాక్‌పీస్‌లు, డస్టర్లు, చీపుర్లు, పినాయిల్, సబ్బులు, ఇతర మౌలిక అవసరాలు, మిగతా మరమ్మతులకు వినియోగిస్తారు.

పాఠశాలల అభివృద్ధికి..

అమ్మ ఆదర్శ పాఠశాలల కింద జిల్లాలో 955 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో 883 పాఠశాలల్లో ఇప్పటికే పనులు పూర్తికాగా, మరో 70 స్కూళ్లలో పురోగతిలో ఉన్నాయి. ఇందుకోసం రూ.35 కోట్లు కేటాయించగా.. రూ.22 కోట్ల నిధులు పాఠశాలల కమిటీలకు అప్పగించారు. ఇక కేంద్ర ప్రభుత్వ పీఎంశ్రీ పథకంలో భాగంగా జిల్లాలోని 28 పాఠశాలలను ఎంపిక చేసింది. ఈ పాఠశాలల్లో వివిధ పనుల నిమిత్తం రూ.3.35 కోట్లు కేటాయించారు. సైన్స్‌ల్యాబ్‌ల ఏర్పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణం, మేజర్ మరమ్మతులకు వీటిని వెచ్చిస్తారు. ఇప్పటి వరకు రూ.1.24 కోట్లతో ఏడు చోట్ల సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయగా, నాలుగు అదనపు తరగతి గదులు సైతం నిర్మించారు.

స్పోర్ట్స్ గ్రాంట్..

జిల్లాలోని పాఠశాలలకు క్రీడా అవసరాల నిమిత్తం రూ.1.11 కోట్లు మంజూరయ్యాయి. ప్రాథమిక పాఠశాలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.10 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.25 వేలు చొప్పున జమ చేయగా, వీటితో ఇప్పటికే పలు పాఠశాలల్లో క్రీడా సామగ్రి కొనుగోలు చేశారు. అలాగే యూత్ అండ్ ఈకో క్లబ్స్ కోసం రూ.3వేల నుంచి రూ.5వేలు, ఏక భారత–శ్రేష్ఠ భారత(ఇతర రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునేందుకు) కోసం రూ.వెచ్చి చొప్పున పాఠశాలల ఖాతాల్లో జమ అయ్యాయి.

నిధుల వినియోగంపై నిఘా

గత ఏడాది పాఠశాలల నిర్వహణ నిధులు సుమారు రూ.2 కోట్ల మేర దుర్వినియోగమయ్యాయి. దీంతో ఈసారి అలా జరగకుండా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈమేరకు పనులు, కార్యక్రమాల అమలు తీరును అదనపు కలెక్టర్ శ్రీజ నేరుగా పర్యవేక్షిస్తున్నారు. స్కూల్, స్పోర్ట్స్ గ్రాంట్ నిధులతో సామగ్రి కొనుగోలు చేసిన వెంటనే స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఆపై ఎంఈఓ, పీడీతో కూడిన బృందం పరిశీలించాల్సి ఉంటుంది. వీరు ప్రతీ పాఠశాలను సందర్శించి అక్కడ కొనుగోలు చేసిన సామగ్రి, బిల్లులు, రిజిస్టర్లను పరిశీలించి ఎప్పటికప్పుడు అదనపు కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలి. కాగా, నిధులను ప్రధానోపాధ్యాయులు డ్రా చేసి ఈ విద్యాసంవత్సరంలో పనులు వెచ్చించిచగా మిగిలిన నగదును వచ్చే ఏడాది నిధులు మంజూరయ్యే వరకు వినియోగించుకునే అవకాశం కల్పించారు.

ప్రత్యేక కార్యాచరణతో 'ఉపాధి' పనులు

- ఇంకుడు గుంతలు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఉపాధి పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న పది రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణతో ఉపాధి హామీ పనులు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన పనుల లక్ష్యాలను చేరేందుకు కృషి చేయాలని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో ట్రెంచ్, ఫీల్డ్ చానల్స్, చెరువు కాల్వల పూడిక తీత పనులను ప్రత్యేక డ్రైవ్‌గా చేపట్టాలన్నారు. అటవీ భూములకు బౌండరీ ట్రెంచ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి హామీ కూలీలకు పని లభించడమే కాక భూముల సంరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. అంతేకాక వ్యవసాయ శాఖ ద్వారా కొత్త పంట కాల్వలు, ఫామ్ పాండ్ల నిర్మాణానికి ప్రతిపాదిస్తే 24 గంటల్లో పనులు ప్రారంభించేందుకు అవకాశముందన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోతున్న ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి తిరుమలాయపాలెం, వైరా, ఏన్కూర్, సింగరేణి మండలాల్లో 15 చొప్పున రెయిన్ హార్వెస్టింగ్ పిట్లు ఏర్పాటు చేయాలని, ఆసక్తి ఉన్న రైతుల పొలాల్లో మండలానికి కనీసం 5 ఫామ్ పాండ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిధులు అందుబాటులో ఉన్న గ్రామపంచాయతీలలో సామాజిక ఇంకుడు గుంతలు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ సూచించారు. కాగా, తిరుమలాయపాలెం మండలంలో గతంలో అత్యధికంగా డెంగీ కేసులు నమోదైనందున ఈసారి పునరావృతం కాకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, డీఆర్వో ఏ.పద్మశ్రీ, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఏఓ డి.పుల్లయ్య, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి, డీఎల్పీఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్నేరుపై కొత్త వంతెనలు



ప్రకాశ్‌నగర్ వద్ద రెండు లేన్లతో ఉన్న వంతెన

పాత బ్రిడ్జిల వెంట నిర్మాణం

- ప్రకాష్‌నగర్, కరుణగిరి వద్ద రెండేసి లేన్లతో నిర్మాణానికి నిర్ణయం
- రూ.80కోట్ల నిధులు మంజూరు..

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలోకి ప్రవేశించేందుకు కీలకంగా నిలుస్తూ మున్నేటిపై ఉన్న రెండు వంతెనలకు తోడు అదనపు బ్రిడ్జిల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. కరుణగిరి, ప్రకాష్‌నగర్ వద్ద రెండు లేన్లతో ఉన్న ఈ వంతెనల పక్కన మరో రెండు లేన్లతో వంతెనలు నిర్మిస్తారు. ఇందుకోసం రూ.40కోట్ల చొప్పున రూ.80కోట్లు మంజూరు కాగా టెండర్లు ఆహ్వానించడంపై అర్‌అండ్‌బీ అధికారులు దృష్టి సారించారు.

కీలకంగా వంతెనలు

జిల్లా కేంద్రం మీదుగా ఇతర ప్రాంతాలకు వారధిగా నిలుస్తున్న ఈ వంతెలు ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్నాయి. అయితే, వంతెనలకు ముందు, తర్వాత రహదారులను నాలుగు వరుసలుగా విస్తరించారు. దీంతో వంతెన వరకు రాకపోకలు సాఫీగా సాగుతున్నా బ్రిడ్జిలపైకి వచ్చేసరికి భారీ వాహనాలతో ఇరుకుగా మారి తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీనికి తోడు ఖమ్మం చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణం చివరి దశకు చేరింది. ఈమేరకు రెండు బ్రిడ్జిలకు పక్కన మరో రెండు వరుసలతో నూతన బ్రిడ్జిలు నిర్మించాలనే నిర్ణయానికి వచ్చారు. మున్నేరుపై మూడు బ్రిడ్జిలు ఉండగా, కాల్వొడ్డులో పాత వంతెనను ఆనుకుని రూ.180 కోట్లతో తీగల వంతెన నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఆపై కరుణగిరి, ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిల సమీపాన కొత్తగా రెండేసి వరుసలతో బ్రిడ్జిలు నిర్మిస్తే రహదారులకు అనుగుణంగా నాలుగు లేన్ల రోడ్డు అందుబాటులోకి వస్తుంది. తద్వారా జాతీయ రహదారులకు అనుగుణంగా వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతాయని భావిస్తున్నారు.

కల ఫలించిన వేళ...

- జిల్లాకు 57 మంది జూనియర్ లెక్చరర్లు
- 2022లో నోటిఫికేషన్.. ఇప్పుడు నియామకం
- మరింత బలోపేతం కానున్న ఇంటర్ విద్య



ఏడుగురు కొత్త జేఎల్‌లు చేరిన సత్తుపల్లి ప్రభుత్వ బాలికల కళాశాల

సత్తుపల్లిటౌన్: ఏళ్ల తరబడి సరిపడా అధ్యాపకులు లేక కునారిల్లుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధన కష్టాలు ఇకపై తీరనున్నాయి. ఏళ్ల తర్వాత కళాశాలల్లో లెక్చరర్ పోస్టులు భర్తీ చేయడంతో విద్యార్థులకు మెరుగైన బోధన అందుతుందని భావిస్తున్నారు. ఈనెల 12వ తేదీన కొత్త జూనియర్ లెక్చరర్లు నియామక పత్రాలు అందుకుని కళాశాలల్లో రిపోర్ట్ చేయగా, జిల్లాకు 57మందిని కేటాయించారు.

అధ్యాపకులు లేక..

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో పూర్తిస్థాయిలో సబ్జెక్టు అధ్యాపకులు లేక బోధన సాఫీగా సాగడం లేదు. ఈ కారణంగా విద్యార్థులు నష్టపోతుండగా, ఫలితాలపై ప్రభావం పడుతోంది. గెస్ట్ లెక్చరర్లు, ఒప్పంద అధ్యాపకులను నియమించినా పూర్తిస్థాయిలో ఫలితాలు రావడం లేదు. దీంతో రాష్ట్రప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో లెక్చరర్లను నియమించడం.. జిల్లాలోని కళాశాలలకు 57మందిని కేటాయించడంతో ఇకపై ఇంటర్ విద్య బలోపేతమవుతుందని భావిస్తున్నారు.

చివరగా వైఎస్సార్ హయాంలో...

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో జూనియర్ లెక్చరర్ల నియామకానికి 2008లో నోటిఫికేషన్ జారీ అయింది. ఆతర్వాత 14ఏళ్లకు మళ్లీ 2022 డిసెంబర్‌లో నోటిఫికేషన్ వచ్చింది. ఆపై 2023 సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహించి, 2024 జూన్‌లోనే ఫలితాలు వెల్లడించినా నియామక ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంది. ఎట్టకేలకు ఇటీవల నియామక పత్రాలు అందించగా అటు అధ్యాపకుల్లో.. ఇటు విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది.

ఎదురుచూపులకు తెర



2009లో పీజీ పూర్తి చేసి ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నా. 2022లో జేఎల్ నోటిఫికేషన్ వచ్చింది. ఇందులో ప్రతిభ కనబర్చగా సత్తుపల్లి బాలికల కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఎదురుచూపులకు తెర పడినట్లయింది.

– కె.శ్వేత, తొర్రూరు

ఆనందంగా ఉంది...



ప్రైవేట్ కాలేజీలో సివిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తూ జేఎల్ పోస్టుకు సిద్ధమయ్యాను. నా పీజీ 2011లో పూర్తయింది. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా కష్టపడి చదవడం తోఫలితం వచ్చింది. సత్తుపల్లి బాలికల జూనియర్ కళాశాలలో పోస్టింగ్ ఇవ్వగా విధుల్లో చేరా.

– కె.రాణి, వరంగల్

కమనీయం.. నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు.. పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రేక్ పాయింట్‌కు లైన్ క్లియర్

- పందిళ్లపల్లిలో ఎరువుల దిగుమతికి 'కోడ్' కేటాయింపు
- కంపెనీల సానుకూలతతో త్వరలోనే రవాణా



పందిళ్లపల్లి రైల్వేస్టేషన్

ఖమ్మంవ్యవసాయం: చింతకాని మండలం పందిళ్లపల్లిలో ఎరువుల రేక్ పాయింట్‌కు లైన్ క్లియర్ అయింది. వివిధ కంపెనీలు ఎరువులు సరఫరా చేసేలా కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖ తాజాగా 'కోడ్' కేటాయించింది. గతంలో ఖమ్మం రైల్వేస్టేషన్ కేంద్రంగా రేక్ పాయింట్ కొనసాగగా, కాజీ పేట–విజయవాడ మధ్య మూడోలైన్ ఏర్పాటు పనులతో తొలగించి పందిళ్లపల్లి స్టేషన్‌కు మార్చింది. అయితే, అనుమతుల్లో జాప్యం జరుగుతుండగా దాదాపు మూడు నెలలుగా రైల్వేవ్యాగన్ల ద్వారా ఎరువుల సరఫరా నిలిచిపోయింది. దీంతో వరంగల్, మిర్యాలగూడ రేక్ పాయింట్ల నుంచి ఇక్కడకు ఎరువుల సరఫరా చేసి కేంద్రాలకు చేరవేస్తున్నా అక్కడక్కడా కొరత ఏర్పడింది. దీంతో కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖ కోడ్ కేటాయించిన నేపథ్యాన ఖమ్మం బదులు పందిళ్లపల్లికి ఎరువుల దిగుమతికి అవకాశం లభించినట్లయింది. ఇప్పటికే లారీ అసోసియేషన్ బాధ్యుల సమస్యలు పరిష్కారం కాగా, హమాలీల సమస్య కూడా త్వరలో ఓ కొలిక్కి రానుంది.

నిల్వల కోసం ఎదురుచూపులు

రానున్న వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఎరువులు నిల్వ చేసేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమవుతోంది. ఏటా యాసంగి సీజన్ తర్వాత మార్చి నెల నాటికే దాదాపు 30 నుంచి 40 వేల మెట్రిక్ టన్నుల వివిధ కంపెనీలకు సంబంధించి యూరియా నిల్వ చేస్తారు. మే నెల నాటికి ఇది 70 వేల మెట్రిక్ టన్నులకు చేరుతుంది. కానీ ఈసారి రేక్ పాయింట్ మారడం, అనుమతుల్లో జాప్యంతో నిల్వ చేయలేదు. పందిళ్లపల్లి రేక్ పాయింట్ నుంచే ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు ఎరువులు సరఫరా చేయనుండగా.. మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, 40 శాతం డీలర్లకు కేటాయిస్తారు.

ముందుకొస్తున్న కంపెనీలు

పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు అనుమతులు వచ్చిన నేపథ్యాన ఎరువులు సరఫరా చేసేందుకు వివిధ కంపెనీలు సిద్ధం చేసుకుంటున్నాయి. త్వరలోనే క్రిబ్‌కో, రామగుండం కంపెనీలతో పాటు మరికొన్ని కంపెనీల యూరియా దిగుమతి జరగనున్నట్లు తెలిసింది. ఒక్కో రైల్వే వ్యాగన్‌లో దాదాపు 3వేల మెట్రిక్ టన్నుల ఎరువులు రానుండగా, నెలకు 20 నుంచి 25 వ్యాగన్లు వచ్చే అవకాశముంది. దీంతో వానాకాలం సీజన్‌కు కావాల్సిన ఎరువులు నిల్వ చేసేందుకు గోదాంలను సిద్ధం చేస్తున్నారు. కాగా, పందిళ్లపల్లి రేక్ పాయింట్‌కు కోడ్ కేటాయించిన నేపథ్యాన ఎరువులతో పాటు ఎఫ్‌సీఐ తరఫున బియ్యం, గోధుమలు, మొక్కజొన్నల ఎగుమతి, దిగుమతికి కూడా అవకాశం లభించినట్లయింది.

గూగుల్ మ్యాప్‌తో ధనవంతుల ఇళ్ల గుర్తింపు

- ఆపై చోరీలు.. సొత్తుతో సహా శ్మశానాల్లోనే నివాసం
- తల్లికి చీర కొనేందుకు తొలిసారి చోరీ
- 90కి పైగా కేసులు, కానిస్టేబుల్‌పై కత్తి దాడి నిందితుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్, ఏసీపీ రఘు తదితరులు

సత్తుపల్లి: సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి గూగుల్ మ్యాప్ ద్వారా అత్యాధునిక భవంతులను గుర్తించి చోరీ చేయడం, ఆపై చోరీ సొత్తును శ్మశానాల్లోనే దాచి అక్కడే బస చేయడం ఆయనకు అలవాటు. తల్లికి చీర కొనేందుకు రూ.300కోసం తొలిసారి చోరీ చేసిన నిందితుడు.. వివిధ కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాక నాలుగు నెలల్లోనే ఎనిమిది జిల్లాల్లో 43కు పైగా చోరీలు చేయడం గమనార్హం. ఈక్రమంలో తనను పట్టుకునేందుకు సిద్ధమైన కానిస్టేబుల్‌పై కత్తితో దాడి చేసి పరారైన నిందితుడిని సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేయగా వివరాలను మంగళవారం ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ వెల్లడించారు.

కానిస్టేబుల్‌పై దాడి

సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ నెల 10వ తేదీ రాత్రి అనుమానాస్పదంగా తచ్చాడుతున్న సురేందర్‌ను విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఎం.నరేష్ విచారించే క్రమాన కత్తితో దాడి చేసి పరారయ్యాడు. దీంతో ఏసీపీ అనిశెట్టి రఘు ఆధ్వర్యాన సీఐ టి.కిరణ్, ఎస్సైలు కవిత, వీరేందర్, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఈమేరకు సురేందర్ పట్టుబడగా చోరీ సొత్తు, బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ సునీల్‌దత్ తెలిపారు. అయితే, ఇంకా ఎవరిదైనా పాత్ర ఉందా, మిగతా సొత్తు ఎవరికి విక్రయించాడనే కోణంలో విచారిస్తూ ఆయనపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు సీపీ చెప్పారు. కాగా, నిందితుడిని అడ్డుకునే క్రమంలో కత్తి పోట్లకు గురైన కానిస్టేబుల్ ఎం.నరేష్, పోలీసులకు సహకరించిన యువకులు చెరుకుపల్లి ప్రసాద్, ఎల్లంగి రాజుకు సీపీ క్యాష్ రివార్డులు అందించారు. అలాగే, కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన ఎస్సై కవిత, కానిస్టేబుళ్లు ఎం.శ్రీనివాస్, శ్రావణ్‌రెడ్డి, ఇమ్రాన్‌ను అభినందించగా.. సత్తుపల్లి పట్టణ, రూరల్ సీఐలు టి.కిరణ్, ముత్తిలింగం, ఎస్సై వీరేందర్ పాల్గొన్నారు.

సాంకేతికత అండగా..

ఏపీలోని ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చితాపూర్‌కు చెందిన తిరుపీధుల సురేందర్ తల్లికి రూ.300 విలువైన చీర కొనేందుకు మొదటిసారి దొంగతనానికి పాల్పడ్డాడు. ఆతర్వాత ఆయన 90 కేసుల్లో ముద్దాయిగా ఉండగా.. చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ కేసులో శిక్ష అనుభవిస్తూ గతేడాది నవంబర్‌లో బెయిల్‌పై వచ్చాడు. ఆతర్వాత ఖమ్మం కమిషనరేట్ పరిధిలో 15, సూర్యాపేటలో ఏడు, నల్లగొండ, ఏలూరు జిల్లాల్లో ఐదు చొప్పున, కొత్తగూడెం జిల్లాలో నాలుగు, వరంగల్ కమిషనరేట్ పరిధిలో మూడు ఇలా మొత్తం 43 కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు. అయితే, దొంగతనానికి ఇళ్లు ఎంచుకునే క్రమాన గూగుల్ మ్యాప్ సాయం తీసుకునే సురేందర్ అత్యాధునిక భవంతులను గుర్తించి ధనవంతులు ఉంటున్నారని తేల్చుకుని రంగంలోకి దిగుతాడు. చోరీ చేసిన సొత్తును శ్మశానవాటికల్లో దాచిపెట్టడం.. ఆయన కూడా అక్కడే ఉంటూ గడిచిన నాలుగు నెలల్లోనే 43చోట్ల రూ.3.33లక్షల నగదు, 461.18 గ్రాముల బంగారు ఆభరణాలు, 424 గ్రాముల వెండి ఆభరణాలే కాక రెండు బైక్‌లు, సెల్‌ఫోన్లు చోరీ చేశాడు.



పన్నులు వసూలయ్యేదెలా?

- చివరి దశకు చేరిన ఆర్థిక సంవత్సరం
- కేఎంసీలో రూ.33.02 కోట్లకు రూ.24.91 కోట్లే వసూలు
- భారం మోపుతున్నారని బిల్ కలెక్టర్ల నిరసన



రెవెన్యూ అధికారులు, బిల్‌కలెక్టర్లతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్



బిల్ కలెక్టర్లు పక్కన పెట్టిన మిషన్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఓ వైపు ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరింది. అయినా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తి పన్నుల బకాయిలు భారీగానే ఉన్నాయి. పన్నులు వంద శాతం వసూలు చేసేలా అధికారులు రోజువారీగా లక్ష్యాలను నిర్దేశించి రెవెన్యూ అధికారులు, బిల్‌కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లకు సూచనలు చేస్తుండగా లక్ష్యాల పేరుతో తమను వేధిస్తున్నారని బిల్ కలెక్టర్లు నిరసన తెలపడం చర్చనీయాంశంగా మారింది. ఏటా లక్ష్యాలను నిర్దేశించగా సాధారణ ప్రక్రియేనని అధికారులు చెబుతుండగా, ఈసారి అలా చేయలేమని బిల్లు కలెక్టర్లు చెప్పడం గమనార్హం. దీంతో రానున్న 13రోజుల్లో రూ.8.10 కోట్ల మేర ఎలా వసూలు చేస్తారన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

రూ.24.91 కోట్ల వసూలు

2024–25 ఆర్థిక సంవత్సరంలో మరో 13 రోజులు మాత్రమే ఉంది. కేఎంసీ పరిధిలో 80,348 అసెస్మెంట్లకు గాను రూ.33.02 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉంది. ఇందులో రూ.24.91 కోట్లు వసూలవగా, ఇంకా రూ.8.10 కోట్ల మేర బకాయి ఉంది. మిగిలిన సమయంలో ఈ పన్నులన్నీ రాబట్టాలంటే రోజుకు రూ.62లక్షలకు పైగా వసూలు చేయాలి. దీంతో అధికారులు సైతం క్షేత్రస్థాయికి వెళ్లి బకాయిదారులను కలుస్తున్నారు.

పన్నుల వసూళ్ల వివరాలు (రూ.కోట్లలో)

రకం	అసెస్‌మెంట్లు	లక్ష్యం	వసూలు చేసింది	బకాయి
రెసిడెన్షియల్	72,827	18.06	14.35	3.71
కమర్షియల్	3,720	8.65	6.29	2.36
రెండూ కలిసి ఉన్నవి	3,771	6.31	4.27	2.03

మాపై వేధింపులు

అధికారులు లక్ష్యాలను విధించి పన్నులు వసూలు చేయకపోతే వేతనం కోత వేధిస్తామని, నోటీసులు ఇస్తామంటే బెదిరిస్తున్నారని మంగళవారం బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆందోళనకు దిగారు. అధికారులు కావాలనే ఇలా చేస్తూ తమను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారంటూ కేఎంసీ కార్యాలయంలో మిషన్లంటినీ పక్కన పెట్టేశారు. దీంతో అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా కార్యాలయానికి చేరుకుని ఆర్‌ఓ శ్రీనివాసరావుతో కలిసి ఉద్యోగులతో సమావేశమయ్యారు. లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేస్తేనే ఫలితం వస్తుందని నచ్చచెప్పిన ఆయన ఆతర్వాత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా లక్ష్యాల మేర పన్నులు వసూలు చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ విషయంలో ఎవరికైనా ఇబ్బందులు ఉన్నాయని చెబితే కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పిన ఆయన.. రానున్న 13 రోజులు క్షేత్ర స్థాయిలో ఉండి వసూళ్లలో నిమగ్నం కావాల్సిందేనని స్పష్టం చేశారు.

సెలవు ఇప్పించండి.. వెళ్లిపోతా

అధికారులు కావాలనే తనను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నందున తాము పని చేయలేనని, సెలవు ఇప్పిస్తే వెళ్లిపోతానంటూ ఓ అధికారి.. అసిస్టెంట్ కమిషనర్ ఎదుట ఆందోళనకు దిగాడు. పని చేస్తున్నా చేయడం లేదని వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఈమేరకు సెలవులైనా ఇప్పించాలని, లేదంటే మరో పోస్టు కేటాయించాలన్నారు. సదరు అధికారి ఆందోళనతో కేఎంసీ కార్యాలయంలో కొంతసేపు ఉద్రిక్తత నెలకొనగా.. రెండు గంటల పాటు జరిగిన వాదనలు కొనసాగుతాయి. చివరకు అసిస్టెంట్ కమిషనర్ సర్దిచెప్పగా ఆర్‌ఐలు, బిల్‌కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు పన్నుల వసూళ్లకు బయలుదేరారు.

ఏటా మాదిరిగానే లక్ష్యాలు

కేఎంసీలో వేతనాలు, ఇతర ఖర్చులు పెరుగుతున్నందున అదే స్థాయిలో ఆదాయం రాబట్టుకునేందుకు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. ఆస్తి పన్నుతోనే అత్యధికంగా ఆదాయం సమకూర్చుకునే అవకాశమున్నందున లక్ష్యాలను నిర్దేశించామని వెల్లడించారు. గతేడాది మాదిరే ముందుకు సాగుతున్నన విషయాన్ని సిబ్బందికి వివరిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు ఉంటే సంప్రదించండి..

రెవెన్యూ ఉద్యోగులకు సమస్యలు ఉంటే నేరుగా తననైనా లేదంటే అసిస్టెంట్ కమిషనర్, ఆర్‌ఓను సంప్రదించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. పన్నుల వసూళ్లపై కార్యాలయంలో మంగళవారం సమీక్షించిన ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఆందోళనకు గురై లక్ష్యసాధనలో వెనకబడొద్దని తెలిపారు. ఉదయం 7నుంచి రాత్రి 9 గంటల వరకు క్షేత్ర స్థాయిలో ఉంటేనే పన్నులు వసూలవుతాయని చెప్పారు. ఈనెల 31 వరకు రెవెన్యూ ఉద్యోగులకు సెలవులు ఉండవని, ఆదివారం కూడా వసూళ్లలో నిమగ్నం కావాల్సిందేనని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ప్రతిభ కనబర్చిన వారికి రూ.3లక్షల బహుమతులు



బ్రోచర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, ఫౌండేషన్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఎస్సెస్సీ వార్షిక పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.3లక్షల విలువైన బహుమతులు అందించనున్నట్లు మిత్రా ఫౌండేషన్, మిత్ర గ్రూప్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు వివరాలతో కూడిన బ్రోచర్లను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి మంగళవారం విడుదల చేశాక, సంస్థ కార్యాలయంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. మొదటి బహుమతిగా రూ.25 వేల నగదు, ల్యాప్‌ట్యాప్, రెండు, మూడో స్థానాల్లో నిలిచిన వారికి రూ.15 వేల చొప్పున నగదు, ఐదుగురు ప్రతిభావంతులకు రూ.10 వేల చొప్పున అందిస్తామని పేర్కొన్నారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారిని విమానంలో ఢిల్లీ తీసుకెళ్లనుండగా తుమ్మల యుగంధర్ ప్రోత్సాహంతో కార్పొరేట్ కళాశాలలో సీట్లు ఇప్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రంగా శ్రీనివాస్, చెరుకూరి యుగంధర్, పాలవరపు శ్రీనివాస్, చారుగుండ్ల రవికుమార్, నాగసాయి నగేష్, మేళ్లచెరువు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ లేకుండానే స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగం

- మంగాపురం వాసి నవ్యకు రాష్ట్రస్థాయి పదో ర్యాంకు



గాదె నవ్య

తల్లాడ: మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన గాదె నవ్య స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగానికి నిర్వహించిన పరీక్షలో 215 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి పదో ర్యాంకుతో ఉద్యోగానికి ఎంపికైంది. ఈ ఫలితాలు సోమవారం రాత్రి వెలువడ్డాయి. నవ్య భర్త పరుచూరి రమేష్ పోలీస్ కానిస్టేబుల్ కాగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఓ పక్క ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఎలాంటి శిక్షణ లేకుండా మూడేళ్ల పట్టుదలతో సిద్ధమైన ఆమె ఉద్యోగానికి ఎంపికవడం విశేషం. కాగా, నవ్య 1–10 వ తరగతి వరకు తల్లాడ సాయి చైతన్య పాఠశాలలో, ఇంటర్ కేఎస్ఎం కళాశాలలో, డిగ్రీ ఖమ్మం నవీన కళాశాల, బీఈడీ మధిర పూర్తి చేసింది.

ఖమ్మం వాసికి అడిషనల్ ఎస్పీగా పదోన్నతి



గోపతి నరేందర్

ఖమ్మంక్రైం: ఖమ్మం పంపింగ్ వెల్‌రోడ్ ప్రాంత వాసి, సామాన్య కుటుంబంలో జన్మించి పోలీస్ శాఖలో ఎస్‌ఐగా ప్రస్థానం ప్రారంభించిన గోపతి నరేందర్‌కు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. త్రీటౌన్ ప్రాంతానికి చెందిన సైదులు – కళావతి కుమారుడైన నరేందర్‌ను ఆయన తండ్రి ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ కష్టపడి చదివించారు. 1996 బ్యాచ్‌లో ఎస్సైగా ఎంపికైన ఆయన ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఎస్సై, సీఐగా, జైపూర్, కరీంనగర్ ఏసీపీగా విధులు నిర్వర్తించారు. ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి గ్యాలరీ అవార్డు అందుకున్న నరేందర్ ప్రస్తుతం కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా పనిచేస్తుండగా అడిషనల్ ఎస్పీగా పదోన్నతి ప్రకటిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆయనను పలువురు అభినందించారు.

చిన్నకోరుకొండి రేషన్ డీలర్ సస్పెన్షన్

- 180 బస్తాల బియ్యం మాయమైన ఘటనలో చర్యలు

కల్లూరురూరల్: మండలంలోని చిన్నకోరుకొండికి చెందిన రేషన్ డీలర్ గూడిద భిక్షాలును సస్పెండ్ చేసినట్లు తహసీల్దార్ పులి సాంబశివుడు తెలిపారు. షాపులో నిల్వ చేసిన 180 బస్తాల బియ్యం చోరీ గురికాగా డీలర్ సోమవారం తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు తహసీల్దార్, ఎస్సై హరిత మంగళవారం విచారణ చేపట్టగా, షాపులో దిగుమతి అయిన 117 క్వింటాళ్ల బియ్యంలో 180 బస్తాల బియ్యం చోరీ జరగడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు బియ్యాన్ని వాహనంలో తీసుకెళ్లినట్లు గుర్తించిన వారు, సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించాలని నిర్ణయించారు. అయితే, ఘటనలో డీలర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త ఉందని భావిస్తూ భిక్షాలును సస్పెండ్ చేయడమే కాక విచారణ కొనసాగిస్తామని తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,125	2,125
పెసలు	7,400	5,800
కందులు	6,800	6,000
మిర్చి	13,700	6,000
మిర్చి తాలు	6,000	5,000
పత్తి	6,800	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,871

యూనివర్సిటీ పేరు మారిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం



నిరసనలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

ఖమ్మంగాంధీచౌక్: హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యథావిధిగా కొనసాగించాలని, అలాకాకుండా పేరు మారిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రతినిధులు హెచ్చరించారు. తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు అంశంపై మంగళవారం ఖమ్మంలోని పొట్టిరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్యులు నిరసన తెలిపారు. ఇకనైనా ప్రభుత్వ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి సీతారామచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు గుమ్మడివెల్లి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు గోళ్ల రాధాకృష్ణమూర్తితో పాటు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, కొత్త వెంకటేశ్వరరావు, చిన్ని కృష్ణారావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, వనమా వేణుగోపాల్ రావు, మాశెట్టి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీఈఎస్ఎస్ఏ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీకి నియామకపత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్‌కు అనుబంధ తెలంగాణ ఎకనామిక్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్స్ అసోసియేషన్ (టీఈఎస్ఎస్ఏ) నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వి.సుమన్, కార్యదర్శిగా ఎన్. తిరుపతిరావు, కోశాధికారిగా డీ.వీ.సాయికుమార్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరెడ్డి, ఎం.కిష్టయ్య, కె.మధు, సహాయ కార్యదర్శులుగా పి.మౌనిక, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.డీ.జోహెందర్ సాహెబ్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎన్.స్పందన, ఈసీ మెంబర్లుగా పి.రామకృష్ణ, బి.స్వాతి ఎన్నికయ్యారు. టీఎన్జీవోస్ ప్రచార కార్యదర్శి ఎర్రమల్ల శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించగా నూతన కార్యవర్గాన్ని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావుతో పాటు సీపీఓ ఏ.శ్రీనివాస్ అభినందించారు.

డిప్యూటీ సీఈఓలుగా పదోన్నతి జాబితాలో ఐదుగురు

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓలుగా పదోన్నతుల జాబితాలో జిల్లా నుండి ఐదుగురు అధికారులకు స్థానం దక్కింది. డీఆర్‌డీఏ ఏఓ ఈ.అనురాధ, ఏపీఎం ఏ.శ్రీనివాసరెడ్డి, ఏపీడీ జి.శ్రీదేవితో పాటు ఎంపీడీఓ బి.సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఈ.శ్రీనివాసరావు ఇందులో ఉన్నారు. శాఖాపరమైన ప్రక్రియలు పూర్తయ్యాక వీరికి పదోన్నతులు ఇవ్వనున్నారు.

కబడ్డీ విజేత 'రాయగూడెం'

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. శ్రీ అంకమ్మ జాతర సందర్భంగా ఈ నెల 16 నుంచి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఫైనల్స్‌లో ఖమ్మం జిల్లా రాయగూడెం జట్టు విజేతగా, ఏపీకి చెందిన గుంటూరు జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఆతర్వాత స్థానాల్లో నల్లగొండ, పుతానీతండా, మల్లారెడ్డిగూడెం జట్లు నిలవగా బహుమతులు అందించారు. నిర్వాహకులు ఈవూరి శ్రీనివాసరెడ్డి, ఆకుల మల్లేశ్వరరావు, కనమర్లపూడి రాము, తుమ్మా ధనమూర్తి, చౌడపు నాగేశ్వరరావు, ఆకుల వెంకటేశ్వర్లు, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 'యువ పార్లమెంట్'

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో బుధవారం వికసిత్ భారత్‌లో భాగంగా 'యువ పార్లమెంట్' పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణరావు తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల నుంచి 104 మంది పేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఒక్కొక్కరికి మూడేసి నిమిషాల సమయం కేటాయించి ప్రతిభ కనబర్చిన వారిని జోనల్ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

హత్యకేసులో ఇద్దరికి జీవిత ఖైదు

కష్టాలకు కారణమని నమ్మి హతం చేసిన వైనం



ఏపీపీ, పోలీసులను సన్మానించిన సీపీ సునీల్‌దత్, ఏసీపీ రఘు

సత్తుపల్లి/కల్లూరు: ఇంట్లో కష్టాలకు కారణమని నమ్మి ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ సత్తుపల్లి ఆరో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన పాటిబండ్ల శ్రీనివాసరావు, అదే గ్రామానికి చెందిన బంధువు పాడిబండ్ల శివ నడుమ పాతకక్షలు ఉన్నాయి. శివ ఇంట్లో ఎదురవుతున్న సమస్యలు, ఆయన పశువులు చనిపోతున్నాయని నూతలపాటి నారాయణరావు, తల్లాడ మండలం మల్లారానికి చెందిన పాస్తం రంగారావును సంప్రదించగా సమస్యలన్నింటికీ శ్రీనివాసరావు చేస్తున్న పూజలే కారణమని చెప్పారు. దీంతో శ్రీనివాసరావును శివ 2023 ఫిబ్రవరి 19 చెన్నూరు–రంగాపురం రోడ్డుపై కత్తితో నరికి హత్య చేయడంతో శ్రీనివాసరావు భార్య కృష్ణమ్మ కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో శివతో పాటు ఆయన తల్లిదండ్రులు రమాదేవి, అర్జున్‌రావు, నారాయణరావు, రంగారావు పై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణ అనంతరం ఏ–1 పాటిబండ్ల శివ, ఏ–5 పస్తం రంగారావుపై నేరం రుజువు కాగా జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ అబ్దుల్‌పాషా వాదించగా.. అప్పటి, ప్రస్తుత సీఐలు హనూక్, ముత్తులింగయ్య ఎస్సైలు రఘు, హరిత, కానిస్టేబుళ్లు మల్లికార్జున్, సుందరం సహకరించారు. నిందితులకు శిక్ష పడేలా విచారణ చేపట్టి చార్జ్‌షీట్ దాఖలు చేసిన ఏపీపీ అబ్దుల్‌పాషా, పోలీసులను ఖమ్మం సీపీ సునీల్‌దత్ మంగళవారం సత్తుపల్లిలో అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



ఇంట్లో ఎగిసిపడుతున్న మంటలు

నేలకొండపల్లి: అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగా, కుటుంబీకులు నిద్ర నుంచి మేల్కొని బయటకు వచ్చేలోగా సర్వం అగ్నికి ఆహుతవడంతో కట్టు బట్టలు మాత్రమే మిగిలాయి. మండలంలోని కొత్త కొత్తూరుకు చెందిన కస్తూరి పద్మకు చెందిన ఇంట్లో సోమవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. నిద్రలో ఉన్న పద్మ, కుటుంబ సభ్యులు మేల్కొని బయటకు పరుగులు తీయగా మంచాలు, బట్టలు, బీరువా, కూలర్ తదితర సామగ్రి కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చేలేగా ఏమీ మిగలకపోగా, ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ పద్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఓ వ్యక్తి తనను చంపుతానని బెదిరించాడని, ఆయనే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు.

'శానిటేషన్' ప్లాన్ రూపొందించండి

- కంపోస్టు డెవలప్‌మెంట్ అధికారి హేమలత
- 9 మున్సిపాల్టీల సిబ్బందికి ఇల్లెందులో ఒకరోజు శిక్షణ

ఇల్లెందు: ప్రతీ మున్సిపాలిటీలో 'సిటీ శానిటేషన్ ప్లాన్' రూపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్లు, శానిటేషన్ జవాన్లకు కంపోస్టు డెవలప్‌మెంట్ అధికారి హేమలత సూచించారు. నూరుశాతం జీరో బేస్డ్ శానిటేషన్ పట్టణాలుగా మార్చాలని, అందుకు అగ్రభాగాన ఉన్న ఇల్లెందు మున్సిపాల్టీలోని సక్సెస్‌ను అధ్యయనం చేసేందుకు వచ్చిన మహబూబాబాద్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 9 మున్సిపాల్టీల అధికారులు, సిబ్బందికి ఇల్లెందులో మంగళవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. బైపాస్ రోడ్‌లోని డంప్‌యార్డులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హేమలత పలు అంశాలపై వివరించారు. ప్రతీ మున్సిపాల్టీలో చెత్త ఉత్పత్తి అయ్యే ప్రదేశాలను గుర్తించాలని, ఎంత మేర చెత్త లభిస్తుందో అంచనా వేయాలని సూచించారు. వర్మీ కంపోస్ట్ తయారీకి తడి చెత్త లభించే ప్రదేశాలను గుర్తించాలన్నారు. కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల మార్కెట్‌ను ఎంచుకోవాలని సూచించారు. ప్రతీ వారం సమీక్షలు నిర్వహించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూర్, ఖమ్మం, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం, మణుగూరు మున్సిపాలిటీల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ

పెనుబల్లి: మండలంలోని మండాలపాడు అంగన్‌వాడీ సెంటర్ తాళాలు తరచుగా పగులగొడుతున్న గుర్తు తెలియని వ్యక్తులు గుడ్లు, బియ్యం, పప్పు దొంగిలిస్తున్నారనే సమాచారంతో సీడీపీఓ నిర్మలాజ్యోతి, సూపర్‌వైజర్ అనురాధ మంగళవారం విచారణ చేపట్టారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్, ఆయా నుంచి వివరాలు సేకరించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వీఎం బంజర్ పోలీసులు టీచర్, ఆయాలతో పాటు గ్రామస్తులపై సైతం విచారించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మధిర: మండలంలోని జిలుగుమాడు సమీపాన వైరా నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. ఈమేరకు డ్రైవర్ కటారపు శ్రీను, యజమాని దేవినేని మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చిట్స్ పేరుతో మోసం కేసులో ఏడేళ్లు జైలుశిక్ష

ఖమ్మం లీగల్: చీటీల పేరుతో మోసం చేసిన కేసులో రఘునాథపాలెం మండలం జీ.కే.బంజర్‌కు చెందిన బానోత్ వీరన్నకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1.50లక్షల జరిమానా విధిస్తూ ఖమ్మం జిల్లా జడ్జి జి.రాజగోపాల్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ప్రైవేట్ చిట్స్ నిర్వహించే వీరన్న వద్ద ఖమ్మంకు చెందిన కె.ఉపేందర్‌తో పాటు 139మంది 10వేల చొప్పున 29నెలల పాటు కట్టారు. ఇందులో రూ86లక్షల మేర సొంతానికి వాడుకున్నా వీరన్న డిపాజిటర్లకు చెల్లించలేదు.

దీంతో ఉపేందర్ రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ శంకర్ వాదించగా, ఉద్యోగులు కె.శ్రీకాంత్, ఎస్.డీ.యూసఫ్ సహకరించారు.

తప్పుడు పత్రాలతో ప్లాట్లు అమ్మిన ముగ్గురిపై కేసు

ఖమ్మంక్రైం: సామాన్య ప్రజలే లక్ష్యంగా మోసాలకు పాల్పడుతున్న నలుగురు రియల్ ఎస్టేట్ వ్యాపారులపై ఇటీవల కేసు చేసిన ఖమ్మం అర్బన్ పోలీసులు మరో ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేశారు. ఖమ్మం అర్బన్ మండలంలోని అగ్రహారం ప్రాంతంలో తమకు సంబంధం లేని ప్లాట్లకు సంబంధించి నాయుడుపేటకు చెందిన మానుకొండ శ్రీనివాస్, ఖమ్మంకు చెందిన తల్లాపల్లి రాజగిరి, సిలివేరు రవి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారు. ఆపై ప్లాట్లను రూ.30లక్షలకు అమ్మినట్లు తెలిసింది. ఖమ్మం పార్శీబంధానికి చెందిన వినుకొండ మరి యన్న ఫిర్యాదుతో సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేపట్టగా నిజమేనని తేలడంతో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కాగా, భూములు, ప్లాట్లు, కొనుగోలు చేసే వారు పత్రాలనే కాక క్షేత్రస్థాయిలోనూ పరిశీలించాలని సీపీ సునీల్‌దత్ ఓ ప్రకటనలో సూచించారు. ఇటీవల కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేదా భూయజమానులు ప్లాట్ల అభివృద్ధి పేరుతో ఫైనాన్సియర్ల నుండి డబ్బు తీసుకుని వారికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారని, ఆపై అవే ప్లాట్లను మరొకరికి జీపీఏ చేసి డబ్బు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయడం లేదనే ఫిర్యాదులు వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఖాతాదారుల డబ్బు వాడుకున్న మాజీ పోస్టల్ ఉద్యోగిపై...

చింతకాని: మండలంలోని చిన్నమండవ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వర్తించిన గొల్లమందల రాంబాబుపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఆయన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా 2012 నుంచి 2022 వరకు పనిచేయగా 66 మంది చెల్లించిన డబ్బు రూ.6, 44,585 వారి ఖాతాల్లో డిపాజిట్ చేయకుండా సొంతానికి వాడుకున్నాడు. కొన్నాళ్లకు ఆయన బదిలీ అయ్యాక విషయం బయటపడడంతో విచారణ చేపట్టిన అధికారులు రాంబాబును ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ విషయమై నివేదిక అందగా పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

మధిర: భార్య పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధిరలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన వర్ధన నరసింహారావు (40) ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా బడ్డీ కొట్టు, హోటల్ నిర్వహిస్తున్నాడు. ఆయన మొదటి భార్య కొన్నాళ్ల అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా నరసింహారావుపై కేసు నమోదైంది. ఆపై రెండుళ్ల క్రితం మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. అయితే కుటుంబ కలహాల నేపథ్యాన ఆమె పుట్టింటికి వెళ్లగా ఆయన తల్లితో కలిసి ఉంటున్నాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయాన మంగళవారం నరసింహారావు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికిపాల్పడ్డాడు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

ముదిగొండ: ముదిగొండ మండలంలోని పెద్దమండవ, గంధసిరి గ్రామాల్లో మున్నేరు నుంచి ఇసుక అక్రమ రవాణా ఆగడంలేదని తెలుస్తోంది. ఇందులో భాగంగానే మంగళవారం న్యూలక్ష్మీపురం మీదుగా ఓ ఇసుక ట్రాక్టర్ వెళ్తుండగా పరిశీలంచాలని ఆర్‌ఐ ప్రసన్నకుమార్‌ను తహసీల్దార్ ఆదేశించారు. దీంతో ఆర్‌ఐ ట్రాక్టర్‌ను ఆపేందుకు యత్నించగా డ్రైవర్ అతివేగంగా వెళ్తూ గ్రామంలోని ఓ వీధిలో ఇసుక డంపు చేసి వెళ్లిపోయాడు. ఈమేరకు ఇసుకను సీజ్ చేసి వివరాలు సేకరిస్తున్నట్లు ఆర్‌ఐ తెలిపారు.

రూ.25వేల విలువైన మద్యం సీజ్



మద్యం, నిందితుడితో ఎక్సైజ్ సీఐ, ఉద్యోగులు

వైరా: వైరా మండలం గన్నవరంలో బెల్ట్‌షాప్‌లో అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని ఎక్సైజ్ ఉద్యోగులు సీజ్ చేశారు. గ్రామానికి మల్లికార్జునరావు బెల్టు షాప్ నిర్వహిస్తున్నాడనే సమాచారంతో మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రూ.25 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మమతారెడ్డి తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

కల్లూరు: కల్లూరులోని తిరువూరు క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, ఇంకొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు... తిరువూరు క్రాస్ మీదుగా వెళ్తున్న కంటైనర్‌ను పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బృందాబం చెక్ గ్రామానికి చెందిన గోబర్ధన్‌రాయ్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడుతున్నాడు. ఈక్రమాన కల్లూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా వెనక కూర్చున్న ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా విసన్నపేటకు చెందిన దుబ్బాక రాజారావు(50) అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే బైక్ నడుపుతున్న వెంకటేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. ఈమేరకు మృతుడి బంధువు ప్రసాద్ ఫిర్యాదుతోకేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌ఎంపీ హత్యకు మరో ఆర్‌ఎంపీ కుట్ర

కామేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స చేయాల్సిన వైద్యులు అర్హతకు మించి వైద్యం చేస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలోనే తన ఆదాయానికి అడ్డొస్తున్నాడని భావించిన ఓ ఆర్‌ఎంపీ ఇంకొకరి హత్యకు యత్నించగా తృటిలో బయటపడ్డాడు. ఈమేరకు వివరాలిలా ఉన్నాయి. సింగరేణి మండలం కొత్తకమలాపురానికి చెందిన రంగారావు ఆర్‌ఎంపీగా గ్రామంలోనే కాక కామేపల్లి మండలం నెమలిపురితండాలోనూ ప్రజలకు చికిత్స చేస్తుంటాడు. అప్పటికే తండాలో ఆర్‌ఎంపీగా కొనసాగుతున్న వేముల రాధాకృష్ణ తన సంపాదనకు రంగారావు అడ్డొస్తున్నాడని భావించి హత్యకు కుట్ర పన్నాడు. ఈమేరకు రంగారావు ఈనెల 15న రాత్రి బైక్‌పై వెళ్తుండగా చౌటకుంట అలుగు సమీపాన రాధాకృష్ణ కారులో అడ్డు పెట్టి మరో ఐదుగురితో కలిసి రాడ్లతో దాడి చేయగా రంగారావుకు గాయాలయ్యాయి. ఇంతలోనే మరో బైక్ వస్తుండడంతో నిందితులు పారిపోయాడు. ఈమేరకు రంగారావు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై సాయికుమార్ విచారణ చేపట్టారు. దంతో రాధాకృష్ణ, నెమలిపురితండాకు చెందిన ధరావత్ నాగలక్ష్మి, ఈశ్వర్, ఖమ్మంకు చెందిన కుక్కల కార్తీక్, సుమంత్, వేణును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.